నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
సోమవారం 23 జూన్ 2025 పేజీలు 8





# వ్యాపారంగా మారిన విద్య




- సామాన్య మధ్యతరగతి వారికి భారంగా తయారయింది
- ప్రభుత్వ,అధికార యంత్రాంగ నియంత్రణ లేకుండా పోయింది

**కంచికచర్ల జూన్ 22 మేజర్ న్యూస్ :** కంచికచర్ల ప్రాంతంలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల మోత మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతూ విద్య అనేది పూర్తి వ్యాపారంగా మారిపోయింది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నియంత్రిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటి మూటలవుతున్నాయి.విద్యాకమిషన్ సిఫార్సులు కాగితాలకే పరిమితమవుతున్నాయి.కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు మాత్రం శూన్యమని చెప్పాలి. దీంతో సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై పెను భారం పడుతుంది. ప్రస్తుతం చదుకునే పరిస్థితులకన్నా,చదువు కొనే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలలు ఈ ఏడాది కూడా ఫీజులు భారీగా పెంచాయి. కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో ఏకంగా 50శాతం దాకా ఫీజులు పెంపు జరిగితే,చిన్న స్థాయి ప్రైవేటు స్కూళ్లలోనూ తక్కువలో తక్కువగా 25 శాతం పెంచేశారు.



2

## అమరావతిని మెడికల్ హబ్ చేయాలన్నదే
# సీఎం లక్ష్యం



**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**ఆరోగ్య యూరాలజీ అండ్ గైనకాలజీ సెంటర్ హాస్పటల్ ప్రారంభం**

**ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్**

వివరాలు 8 లో



## రైతు బజారులో
# దళారుల హవా

- దళ్ళారి వ్యవస్థకు బిగ్ బాస్‌గా అధికార పార్టీ పట్టణ సెక్రెటరీ.....
- బిగ్ బాస్ రైతు బజార్‌లో పాగా వేసి భారీగా వసూల్ చేస్తున్న వైనం.....
- నెలవారీ కమిషన్ మత్తులో ఎస్టేట్ ఆఫీసర్

**జగ్గయ్యపేట జూన్ 22 మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన రైతులు బతుకులు మారడం లేదు అనడానికి చక్కటి నిదర్శనం జగ్గయ్యపేట రైతు బజార్లో దళారీ వ్యవస్థే. ఆనాడు రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ముందు ఆలోచనతో చక్కటి ప్రణాళికతో రైతులు వారు పండించిన పంటలకు వారే గిట్టుబాటు ధరను నిర్ణయించుకుని దళారుల నుండి మోసపోకుండా ఉండేందుకు రైతు బజారులను స్థాపించి రైతు బజార్లో వారు పండించిన పంటలను రైతులే స్వయంగా అమ్ము కొని వెళ్లే విధంగా రైతు బజార్లో రైతులకు అన్నీ సౌకర్యాలు కల్పించడం జరిగింది. కానీ కొంత మంది అక్రమార్కులు అవినీతిపరుల వలన ఆయన ఆశయం అబ్బాస్ పాల్ అవుతుంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో దళారులు రైతు బజార్లో ప్రవేశించి రైతులకు అన్యాయం చేస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా రైతు బజారులో దళారుల హవా రోజు రోజుకి పేట్రేగిపోతుంది. ముఖ్యంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఉన్న రైతు బజార్లో రైతులకంటే దళారులే అధికంగా సంఖ్యలో ఉన్నట్లుగా తెలుస్తుంది. వీరికి బిగ్ బాస్‌గా పట్టణ అధికార పార్టీ సెక్రటరీ రాధా అలియాస్ రాధాకృష్ణ చక్రం తిప్పుతూ వీరు నుండి అక్రమంగా నెలవారి మామూళ్లు వసూల్ చేస్తూ నెలకు సుమారు ఐదు లక్షల రూపాయలు జేబులు నింపుకుంటున్నట్లు ప్రజలు

మిగతా 2లో

# వ్యాపారంగా మారిన విద్య




(మొదటిపేజీ తరువాయి)

సాధారణ స్కూళ్ళలో కూడా రూ.50 వేల వార్షిక ఫీజు ఉంది. దీంతో పాటు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, ఇతర వస్తువులన్నీ తమ వద్దే కొనాలంటున్నాయి. ఎల్ కే జీ నుంచే ఫీజుల భారంతో ముఖ్యంగా సామాన్య మధ్య తరగతి కుటుంబాల వారు పిల్లలను చదివించాలంటేనే వణికిపోతున్నారు.మధ్యస్థాయి పాఠశాలల్లో పిల్లలను చదివించాలన్నా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మండల ప్రాంతంలోని ప్రైవేట్ పాఠశాలల దందాకు అంతేలేకుండా పోయింది. పాఠ్యపుస్తకాల పేరుతో వేలకు వేలు తల్లిదండ్రుల నుండి గుంజుతున్నారు. పాఠశాలల పేరుతో పాఠ్యపుస్తకాలు ముద్రించి అమ్మటం నేరమైనప్పటికీ అధికారుల సహకారంతో బహిరంగంగా దోచుకుంటున్నారు. ఉత్తమ బోధన పేరిట తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. వివిధ వసతులు, వస్తువులు తదితర కారణాలు చెప్పి ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు మూడు నుండి పదివేల వరకు పాఠ్యపుస్తకాల పేరుతో వసూలు చేస్తున్నారు. యూనిఫామ్ అంటూ టై,బెల్ట్,బ్యాడ్జ్ అంటూ అదనంగా రెండు మూడు వేలు గుంజుతున్నారు. యాచకుడైన తన పిల్లలకు ఇంగ్లీష్ విద్య కావాలని అనుకోవడం పాఠశాలల దోపిడీకి నాంది పలికింది. ఈ విద్యా సంవత్సరంలో కంచికచర్ల ప్రాంతంలోని ప్రైవేటు విద్యాసంస్థలన్నీ సిండికేట్ గా మారి అధికంగా ఫీజులు పెంచారు. పాఠ్యపుస్తకాల పేరుతో భారీగా వసూలు చేస్తున్నారు.కొన్ని పాఠశాలల్లో ఏకంగా పుస్తకాల అమ్మకాల దుకాణాలే తెరిచారు.ఆ పాఠశాలల్లో చదవాలంటే మా వద్దనే పుస్తకాలు కొనాలంటూ వేరేచోట ఇలాంటి పుస్తకాలు దొరకవని ఆంక్షలు జారీ చేస్తున్నారు.

మరికొందరు తమ పాఠశాలల్లో ఎటువంటి పుస్తకాలు అమ్మడం లేదని పైకి చెప్తూ సమీపంలోనే ఏదో ఒక ఇంటిని లేదా గోదామును అద్దెకి తీసుకొని యదేచ్చగా వ్యాపారం చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నప్పటికీని సద్వినియోగం చేసుకోవడం లేదని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. పేద,మధ్య తరగతికి చెందిన ప్రజలు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఆరాటపడుతూ ఉద్యోగుల,ధనవంతుల పిల్లలతో సమానంగా తమ పిల్లల్ని చదివించుకోవాలనే ఆతృతతో అప్పులు చేసైనా ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడానికి పోటీ పడుతున్నారు.వారి బలహీనతను ప్రవేట్ విద్యాసంస్థలు ఆసరాగా తీసుకొని ఫీజు'లుం పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. విద్యా శాఖ అధికారులు నిద్రావస్థలో ఉండి చోద్యం చూస్తున్నారని, మామూళ్లకు అలవాటు పడి మత్తులో ఉన్నారని దయచేసి అవి వదిలించుకుని 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం డొనేషన్లు లేకుండా అడ్మిషన్లు ఇవ్వాలి.ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే తీసుకోవాలి, 30%శాతం ఎస్సీ,ఎస్టీ పేద పిల్లలకు నిర్బంధ విద్యను అందించాలి.కానీ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ నిబంధనలను పాటించకపోగా ఏ ఒక్క పాఠశాలకు కూడా కనీస ఆటస్థలం లేకపోవడం గమనారహం.చీకటి గదుల్లో ఇరకాటంలో నిర్బంధించి పిల్లల అంధత్వానికి కారకులు అవుతున్నారు. చిన్నతనంలోనే కంటి అద్దాలతో మోయలేని పుస్తకాల బ్యాగులతో వంగి వాలిపోయి అవిటి తనాన్ని చదువును భారంగా పిల్లలు మోస్తూ..చదివించలేని ఆర్థిక భారంతో తల్లిదండ్రులు సతమతమవుతున్నారు.వసతులు లేకపోయినప్పటికీ ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లకు అనుమతులిస్తూ విద్యార్థులను,తల్లిదండ్రులకు పరోక్షంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. టీచర్లకు బీఈడీ/డీఈడీ టెట్ అర్హత లేకున్నా తక్కువ వేతనాల పెట్టుబడితో ప్రైవేట్ బోధన బదులతో వ్యాపారం చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు పెంపొందించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలలో మంచి విద్య దొరుకుతుందన్న నమ్మకం అందరిలో కల్పించాల్సిన అవసరం ఉందని విశ్రాంత ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.



## రైతు బజారులో దళారుల హవా

(మొదటిపేజీ తరువాయి)


బిగ్ బాస్ రాధా అలియాస్ రాధాకృష్ణ


ఎస్టేట్ ఆఫీసర్ కందుల వెంకటరమణ

బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఈ విధంగా అక్రమంగా వసూలు చేసిన డబ్బులు ఎవరెవరికి ఎంతెంత వాటాలు అనేది అధిష్టానానికి ఎరుక. దళారీ వ్యవస్థను నిర్మూలించాల్సిన రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ నెలవారి మత్తులో(నిషేధిత గుట్కా సేవించే మత్తులో ) ఉత్సవ విగ్రహంలా వ్యవహరిస్తున్నారు అని వినియోగదారులు విమర్శిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు ధరలు తూనికల్లో వినియోగదారులను మోసం చేస్తూ ప్రశ్నించిన వారి పట్ల దురుసుగా అసభ్య పదజాలాలతో తిడుతూ వారిపై భౌతిక దాడులకు పాల్పడుతూ వారు ఇష్టాను రాజ్యముగా వ్యవహరించటం రైతు బజార్లో పరిపాటిగా మారింది. ఈ విధంగా జగ్గయ్యపేట రైతు బజార్లో " అందరూ శాఖాహారులే రొయ్యల బుట్ట మాయ మాయే " అనే చందాన ఉంది ఇక్కడ పరిస్థితి. కనుక ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులు పండించిన పంటలను రైతు బజార్లో రైతులే స్వయంగా అమ్ముకునే వెసులుబాటును అధికారుల ద్వారా కల్పించాలని రైతులు కోరుతున్నారు.

# వాయిదా పడిన తెలుగుదేశం పార్టీ సమస్తాగత ఎన్నికలు





**నాగాయలంక మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలోని బస్టాండ్ రోడ్డులో గల నాగాయలంక మండల ప్రెసిడెంట్ మెండు లక్ష్మణ రావు ఇంటి పక్కన మండల తెలుగుదేశం పార్టీ 22 గ్రామాల కమిటీలు ఎన్నికలు జరుగుటకురాష్ట్ర పార్టీ ఆదేశానుసారము ఎన్నికల నిర్వహణ అధికారిగా వచ్చినటువంటి పెడన జిల్లా పరిషత్ సభ్యులు అర్జా. వెంకట నగేష్ మండల పార్టీ ప్రెసిడెంట్ మెండు. లక్షణరావు అధ్వర్యములో చుట్టుప్రక్కల గ్రామములో కల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బూత్ కమిటి నెంబర్లు క్రీయాశీలక సభ్యులు వారి గ్రామాలు నుండి విచ్చేచి ఎన్నికల అధికారి ఏ కాబిప్రాయముతో వారి గ్రామాల ప్రెసిడెంట్, కమిటి సభ్యులు పేర్లు ఇచ్చిఉన్నారు కాని కొన్ని గ్రామాల కమిటిలు పూర్తిఅ యిన పిదప అచ్చట సమావేశమునకు వచ్చినటువంటి మండవ. బాలవర్ధినరా వు సమావేశములో నాకు సంబందం లేకుండా నా మండలములో పేర్లు రాయటానికి వీలులేదని అప్పటికి అప్పుడు వారి అనుచరులకు ఫోన్లు చేసి పేర్లు చెప్పమని వారి పేర్లు కూడా ఇవ్వమని ఎలక్షన్ అదికారికి సిపార్సు చేస్తు వారి అనుచరులతో, ఆయన వ్యక్తిగతముగా నానా గొడవ చేసినారు. ఈ గొడవలో పరిశిలకులవారు ఏమి చెప్పిన వినకుండా సమావేశము నిర్వహించిన మండల పార్టీ అధ్యక్షులు వారితో అసభ్య పదజాలముతో మట్లాడి తగువు పెట్టుకొనుట చేత ఎన్నికల అధికారి ఎన్నికను కొన్ని గ్రామలు పూర్తి చేసి చివరకు వెనుదిరిగి వెళ్ళినారు. అక్కడకు వచ్చినటువంటి నాగాయలంక గ్రామ నివాసి, జిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత, నాగాయలంక గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పల ప్రసాద్ మధ్య వివాదము జరిగింది.

# రౌడీషీటర్‌లకు, సస్పెక్ట్‌లకు కౌన్సిలింగ్









**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్:** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్ పరిదిలోని అన్నీ పోలీసు స్టేషన్ల, టాస్క్ ఫోర్స్ కార్యాలయం లలో ఆయా పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ లకు, లా & ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్ లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ........ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా గంజాయి, ఇతర మత్తు పదార్ధాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



# శక్తి, రోగ నిరోధక శక్తి, జీవనోత్సాహాన్ని సురక్షితంగా పునఃప్రాప్తి చేసుకోవడమెలా?

**హెచ్ సీ జీ క్యాన్సర్ సెంటర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏ సత్య శ్రీనివాస్**

**విజయవాడ, జూన్ 22, మేజర్ న్యూస్ :** క్యాన్సర్ చికిత్స పూర్తవడం అనేది ఒక గొప్ప వైద్య మైలురాయి. ఇది చికిత్స విజయాన్ని సూచించినా, తదుపరి అత్యవసర దశ – వ్యవస్థీకృత పునరుత్థానం – ప్రారంభమవుతుంది. ఈ దశలో శక్తిని పునరుద్ధరించటం, రోగనిరోధక వ్యవస్థను స్థిరపరచడం, చికిత్స అనంతర శారీరక, మానసిక ప్రభావాలను నిర్వహించటం జరుగుతుంది. ఈ పునరుత్థానం ఆటోమేటిగ్గా జరగదు – దీని కోసం సదుపాయాలు, ప్రణాళిక, వైద్య పర్యవేక్షణ అవసరం. 1. క్యాన్సర్ చికిత్స అనంతరం అలసటకు లక్ష్యిత నిర్వహణ అవసరంచికిత్స అనంతరం ఏర్పడే అలసట సాధారణ తలనొప్పిలా కాకుండా తీవ్రమైనదిగా ఉంటుంది. ఇది విశ్రాంతితోనే తగ్గదు. ఈ అలసట రక్తహీనత, కండరాల బలహీనత, శరీరంలో మేటబాలిజం మార్పులు, హార్మోన్ల సమతుల్యత లేమి వంటివి కారణమవుతాయి.సహజమైన వ్యాయామాలు (తక్కువ ప్రభావం కలిగినవి), ఉదాహరణకు తేలికపాటి నడకలు లేదా స్ట్రెచింగ్, శరీర సత్తాను మెరుగుపరచడంలో సహాయపడతాయి.పేషెంట్‌లు పాత జీవనశైలికి వేగంగా తిరిగి రావడం తప్పు. గుండె ధకధకలు, శ్వాస సమస్యలు ఉంటే, రక్తహీనత లేదా హార్మోన్ల లోపాన్ని పరిగణనలోకి తీసుకొని పరీక్షలు చేయాలి.ఫిజియోథెరపిస్ట్ పర్యవేక్షణలో ఫిజికల్ రిహ్యాబిలిటేషన్ వల్ల శరీర సమతుల్యత, కండరాల బలం మెరుగవుతుంది. 2. ఆహారం: ఫుడ్ సప్లిమెంట్స్ కంటే సంపూర్ణ ఆహారమే మేలైనదిపునరుత్థానంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. కొన్ని సందర్భాల్లో సప్లిమెంట్స్ అవసరమయినప్పటికీ, సంపూర్ణ ఆహారాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలి.అవసరమైన ముఖ్య పదార్థాలు:ప్రోటీన్ (పప్పులు, పన్నీర్, గుడ్లు, చేపలు లేదా తక్కువ కొవ్వు కలిగిన మాంసం) – కండరాల పునరుద్ధరణకు.యాంటీఆక్సిడెంట్ పుష్కలంగా ఉన్న కూరగాయలు, పండ్లు – ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గించేందుకు.మిల్లెట్‌లు లేదా బ్రౌన్ రైస్ వంటి ఫైబర్-రిచ్ ధాన్యాలు – శక్తిని స్థిరంగా విడుదల చేస్తాయి.శరీరాన్ని హైడ్రేట్ చేయడం కోసం తాగినీరు, బ్రోథ్‌లు, హెర్బల్ టీలు.అపెటైట్ లేకపోవడం లేదా రుచి మార్పులు ఉంటే, డైటీషియన్‌ను సంప్రదించాలి. 3. రోగనిరోధక శక్తి పునరుద్ధరణ క్రమంగా జరుగుతుందిక్యాన్సర్ చికిత్స తరువాత రోగనిరోధక వ్యవస్థ బలహీనపడవచ్చు. మార్కెట్‌లో దొరికే 'ఇమ్యూన్ బూస్టర్లు' కంటే వైద్యంగా రుజువైన చిట్కాలను అనుసరించాలి:రోజుకు 7–8 గంటల నిద్ర.మితమైన వ్యాయామం.స్ట్రెస్ తగ్గించేందుకు ప్రాణాయామం, స్క్రీన్ టైమ్ తగ్గించడం.కొన్నిసార్లు రీ-ఇమ్యూనైజేషన్ అవసరమవుతుంది (ఉదాహరణకు స్టెం సెల్ ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత). టీకాలు తీసుకునే విషయంలో ఆంకాలజిస్ట్ సలహా తీసుకోవాలి. 4. చికిత్స తర్వాత కూడా ఇన్ఫెక్షన్ నివారణ అవసరంచికిత్స అనంతర కాలంలో కూడా ఇన్ఫెక్షన్ల ముప్పు కొనసాగుతుంది.

**సురక్షిత చర్యలు :** తరచూ చేతులు కడగడం.ఆసుపత్రి/బయటి జనసంచార ప్రాంతాల్లో మాస్క్ వాడకం.పచ్చిగా లేదా పూర్తి వండని ఆహారాల నివారణ.క్రొత్తగా జ్వరం, దగ్గు, వాంతులు, చర్మంపై దద్దుర్లు మొదలైతే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. 5. మానసిక ఆరోగ్యం అనేది పునరుత్థానంలో కీలకంక్యాన్సర్ చికిత్స అనంతర కాలంలో మానసిక ప్రభావాలు ఎక్కువగా బయటపడతాయి.ఆందోళన, భయాలు, స్వీయ భావంలో మార్పులు, ఫెర్టిలిటీ, లైబిడో, సెక్సువల్ ఫంక్షన్ వంటి సమస్యలు సంభవిస్తాయి.సహాయంగా కౌన్సిలింగ్, సపోర్ట్ గ్రూప్స్ లేదా అవసరమైతే సైకియాట్రిక్ సేవలు పొందడం అవసరం. మానసిక ఆరోగ్యాన్ని కూడా ఫాలోఅప్ కేర్‌లో భాగంగా పరిగణించాలి. 6. పునరుత్థాన లక్ష్యాలు వ్యక్తిగతంగా ఉండాలిప్రతి పేషెంట్‌కు పునరుత్థాన మార్గం వేరే ఉంటుంది. పాత స్థాయిని తిరిగి పొందే సమయం ప్రతి ఒక్కరికీ భిన్నం.చిన్న లక్ష్యాలు – స్వయంగా భోజనం తయారు చేయడం లేదా తేలికపాటి పనులను మొదలుపెట్టడం – ఇవన్నీ ప్రగతిని సూచించే సూచికలు. 7. దీర్ఘకాలిక ప్రభావాలు లేదా మళ్లీ వచ్చే ముప్పు పర్యవేక్షణచికిత్స తర్వాత నెలల తరబడి కొన్నిప్రభావాలు కనిపించవచ్చు:నరాల నష్టం (న్యూరోపతి)గుండె క్రియలో మార్పులుముందస్తు మెనోపాజ్ఈ లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. రెగ్యులర్ ఫాలోఅప్‌లు క్యాన్సర్ మళ్లీ రావడం నివారించడంలో సహాయపడతాయి.

# నేడు యువత పోరును జయప్రదం చేయండి



**పామర్రు జూన్ 22 మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ సోమవారం నిర్వహించి తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆపార్టీ నాయకులు పిలుపునిచ్చారు. పామర్రు మాజీ శాసనసభ్యులు, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు పామర్రు లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు యువత పోరు పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసిన కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు, యువతకు అండగా నిలుస్తూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం లో సోమవారం నిర్వహించబోయే యువత పోరు కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గం లోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పామర్రు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, పామర్రు టౌన్ పార్టీ అధ్యక్షుడు నందిపాటి సురేష్ రెడ్డి, పార్టీ నాయకులు ఆరుమళ్ళ శ్రీనాథ్ రెడ్డి, రాజులపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పురుగుమందుల ముఠా గుట్టు రట్టు

**విజయవాడ, జూన్ 22, మేజర్ న్యూస్ :** భారీ స్థాయి నకిలీ పురుగుమందుల ముఠాలో కీలక నిందితుల్లో ఒకరైన రాజేంద్ర చెచానీ అలియాస్ రాజు చెచానీని తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. మే 28న రాజేంద్రను రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ జిల్లా బస్సీ గ్రామంలోని అతని ఫాం హౌస్‌లో, స్థానిక పోలీసుల సహాయంతో పట్టుకున్నారు. భారత వ్యవసాయ రంగంలో తీవ్ర స్థాయిలో పెరుగుతున్న నకిలీ పురుగుమందుల సమస్యను ఈ కేసు బైటపెట్టింది. చెచానీ గత ఏడేళ్లుగా అక్రమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ, చట్టవిరుద్ధమైన నెట్‌వర్క్‌ను నడిపిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. చెచానీకి బస్సీలో మహేశ్వరి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ పేరిట షాపు కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది.

# పలువురికి విక్కుర్తి పరామర్శ





**కోడూరు మేజర్ న్యూస్:** ప్రముఖ పారిశ్రామికవేత్త, అవనిగడ్డ నియోజకవర్గ కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు పలువురుని పరామర్శించారు. కోడూరు మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన విస్సంశెట్టి వీరబాబును విక్కుర్తి పరామర్శించారు. వీరబాబుకు ఇటీవల సర్జరీ జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న విక్కుర్తి, మాచవరం గ్రామంలోని వీరబాబు స్వగృహంలో పరామర్శించి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అవనిగడ్డ మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకులు అద్దంకి నారాయణరావును శనివారం సాయంత్రం విక్కుర్తి పరామర్శించారు. అద్దంకి నారాయణరావు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీంతో రామచంద్రపురం పంచాయతీలోని వలందపాలెం లో గల నారాయణ రావు స్వగృహంలో విక్కుర్తి పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాలలో విక్కుర్తి రాంబాబు, న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ శ్రీరామచంద్రమూర్తి, రేపల్లె ముసలయ్య,బర్మా బుజ్జి, ఎస్ పున్నయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## బడుగు బలహీన వర్గాల ఆశాకిరణం రామకోటి

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ జడ్పిటిసి సభ్యులు దివంగత అడపా రామకోటి 17 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ శాసన సభ్యులు నియోజకవర్గ వై ఎస్ ఆర్ సి పి సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో అడపా రామకోటి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మాట్లాడారు విద్యార్థుల సమస్యలతో పోరాటం చేస్తూ విద్యార్థుల నాయకుడుగా ఆర్టీసీ కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఆర్టీసీ సమస్యలపై పోరాటం చేసి కార్మిక నాయకులుగా అంచెలు అంచలుగా ఎదుగుతూ అవనిగడ్డ జడ్పిటిసిగా నియోజకవర్గంలోని బడుగు బలహీన వర్గాల వారికి ఎన్నో సేవలు అందించి వారికి ఆశాకిరణంగా నిలిచిన మహోన్నత వ్యక్తి అడపా రామకోటి అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు సింహాద్రి వికాస్ రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి గాజుల జై గోపాల్ కృష్ణా జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్టిఏ విభాగ అధ్యక్షులు పోనమాల నాగరాజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గుర్రం బసవయ్య వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు జెడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు మాజీ సర్పంచ్ నలకుర్తి పృథ్వీరాజ్ మండల యూత్ కన్వీనర్ చింతలపూడి బాలు యాసం శివ గార్లపాటి గోపి గరికిపాటి కృష్ణారావు అయ్యప్పలతో పాటు పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు రామకోటి అభిమానులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో కెనరా బ్యాంకు దగ్ధం

**ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**



**జగ్గయ్యపేటజూన్ 22 మేజర్ న్యూస్ :** పట్టణంలోని కోదాడ రోడ్డులో కెనరా బ్యాంక్ షార్ట్ సర్క్యూట్ దగ్ధమైన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వెంటనే స్పందించి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బందితో మాట్లాడి, దగ్ధానికి కారణాలు, నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులు వివరించగా, బాధితులకు అవసరమైన సహాయం అందించాలని సంబంధిత శాఖలకు సూచించారు. తక్షణమే స్పందించి ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేయడంతో జగ్గయ్యపేట ఫైర్ సిబ్బందిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

## శిరీష కుటుంబ సభ్యులను పరామర్శించిన వర్ల రామయ్య, కుమార్ రాజా దంపతులు



**పామర్రు జూన్ 22 మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష తల్లి సలివేంద్రం ఆగ్నేశమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆగ్నేశమ్మ చిత్రపటానికి పూలమాలవేసి రామయ్య, కుమార్ రాజా దంపతులు నివాళులర్పించారు. తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరితో పాటు పలువురు నాయకులు పాల్గొని శిరీష కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియపరిచారు.

## సర్టిఫికెట్లు పోయినవి

కృష్ణాజిల్లా మొవ్వ మండలం మొవ్వ గ్రామం కాపురస్తురాలు గూడపాటి నాగశ్రీకి చెందిన పదవ తరగతి మార్కుల మెమో రోల్ నెంబర్ 2 013109971, బదిలీ ధ్రువీకరణ పత్రము, స్టడీ, కాండాక్ట్ ధ్రువీకరణ పత్రాలు పోయినవి. ఆచూకీ తెలిసినవారు 8978783547 ఫోన్ నెంబర్‌కు తెలపగలరు.

# యువత పోరుకు నిరుద్యోగులు తరలిరండి

## యువ నేత సింహాద్రి



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : నిరుద్యోగులకు బాసటగా వైఎస్ఆర్సిపి చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తనయుడు యువ నేత సింహాద్రి వికాస్ పిలుపునిచ్చారు. స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదేశాల మేరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో యువత పోరు పోస్టర్ ను ఆదివారం వికాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్ తో చెలగాటం ఆడుతోందని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి మోసపోయేది యువతే అని, ప్రతిసారి యువతకు 3వేలు నిరుద్యోగ భృతి ఎప్పుడు అమలు చేస్తారని ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి అంశాలపై దాటవేత ధోరణి అవలంబిస్తున్న ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు సోమవారం మచిలీపట్నంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత పాల్గొని విజయవంతం చేయాలని పిలపునిచ్చారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేక వచ్చిందని, మొన్న సత్తెనపల్లి జగన్ పర్యటనలో తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుడు ఒక సినిమా పోస్టర్ చూపిస్తే అది జగన్ పై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం చేసే అన్యాయాలను ఈ నాలుగు సంవత్సరాలు ప్రజల తరుపున నిలబడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని, ఎప్పుడు ఎన్నికలు జరిగిన వైసీపీ మళ్ళీ అధికారంలోకి వస్తుందని అన్నారు2004 నుండి 2024 వరకు ఐదు పర్యాయాలు ఎన్నికలు జరిగితే ప్రతిసారి ఎన్నికలలో చంద్రబాబు నాయుడు అమలు కానీ వాగ్దానాలు ఇస్తూ ప్రజలను మోసం చేయడం ప్రజలు మోసపోవడం జరుగుతూనే ఉందన్నారు ఇటీవల ఓ జర్నలిస్ట్ చంద్రబాబు నాయుడుని సంగతి ఏమిటి అని అడిగితే నాలుక తెగ్గోస్తా అని జర్నలిస్టులకు వార్నింగ్ ఇచ్చిన విషయాన్ని వికాస్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర



ప్రచార విభాగ కార్యదర్శి గాజుల జయ గోపాల్, కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆర్టిఏ విభాగ అధ్యక్షులు పోనమాల నాగరాజు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గుర్రం బసవయ్య, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ మండల కో ఆక్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష మండల యూత్ కన్వీనర్ చింతలపూడి బాలు, యాసం శివ గార్లపాటి గోపి అయ్యప్పలతో పాటు పలువురు పాల్గొన్నారు.



## పథకాలను ప్రజలకు అర్ధమయ్యేలా వివరించండి

**పెడన,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను, సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థం అయ్యేలా బలంగా తీసుకెళ్లాలని పట్టణ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు తలశిల స్వర్ణలత పార్టీ నాయకులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం వీరభద్రపురం కర్ణబక్త కళ్యాణ మండపం లో జరిగిన 7,8,9 వార్డుల కమిటీల సమావేశం పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పాలనను,వ్యవస్థలను గాడిలో పెట్టి రాష్ట్ర సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబు నాయకత్వానికి మనమంతా అండగా ఉండాలని ఆమె కోరారు. అనంతరం పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య మాట్లాడుతూ పట్టణంలో ఉన్న అన్ని వార్డులలో కమిటీలను పూర్తి చేస్తామని, పటిష్ఠమైన పార్టీ యంత్రాంగం తయారు చేసి 2029లో మరలా కూటమి ప్రభుత్వం వచ్చేలా,జగన్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాహబ్ ఖాన్, కమ్మగంటి వెంకటేశ్వరావు,తమ్మా భీమయ్య యక్కల బసవా,తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సహాయం



మచిలీపట్నం మేజర్ న్యూస్ : పెడన నియోజకవర్గం గూడూరు మండలం పోలవరం గ్రామంలో గత వారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆదివారం లంకిశెట్టి బాలాజీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమం మచిలీపట్నంలో లంకిశెట్టి కార్యాలయంలో అందించారు. పోలవరం చెందిన మురాల లక్ష్మీకుమారి ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో జూన్ 17వ తారీకు తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 30,000 నగదు ఇతర విలువైన వస్తువులు సామాన్లు ఇంటిదస్తావేజులు తో సహా సర్వస్వం కాలిపోయాయి. లక్ష రూపాయలకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లింది. మొవ్వ ఫైర్ స్టేషన్ సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కష్టంలో ఉన్న మురాల లక్ష్మి కుమారి కి ఆదివారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ తరఫున వంట సామాన్లు, చీరలు, నిత్యవసర వస్తువులు, 2000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని లంకిశెట్టి బాలాజీ అందించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు ఇచ్చే ప్రభుత్వ సహాయం ఐదు వేల రూపాయలు నుండి లక్ష రూపాయలకు పెంచాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ గృహ నిర్మాణ సంస్థ ద్వారా తాత్కాలిక ఇంటి నిర్మాణం కోసం సామాజిక కూడా అందజేయాలని బాలాజీ కోరారు. మండల కేంద్రమైన గూడూరులో ఫైర్ స్టేషన్ అవసరం ఎంతైనా ఉందని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, కూతని ఈశ్వర రామాంజనేయులు, సీతంశెట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



**నందిగామ, జూన్ 22, మేజర్ న్యూస్:** జిల్లా ప్రధానోపాధ్యాయుల, మండల విద్యాశాఖాధికారుల సర్వసభ్య సమావేశం, ఆత్మీయ సమావేశము తేజా డివిఆర్ కళాశాల నందిగామలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కు బదిలీపై వచ్చిన, ప్రమోషన్ పై నూతనముగా జాయిన్ అయినా ప్రధానోపాధ్యాయులకు స్వాగతం పలికి అభినందిం చారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రధానోపాధ్యాయులు నిర్వహించవలసి ఉన్న వివిధ కార్యక్రమాలు, అకాడమీ క్యాలెండర్ పై అవగాహన యాప్ వినియోగంపై అవగాహన, కొత్తగా ప్రవేశపెట్టబడిన హిట్ కార్యక్రమము, నో బ్యాగ్ డే రోజు నిర్వహించవలసిన కార్యక్రమములు, విద్యార్థులకు కొత్తగా ప్రవేశపెట్టబడిన అసైన్మెంట్ బుక్ వినియోగము, ఇతర అంశములపై నిపుణులైన ప్రధానోపాధ్యాయులు క్లుప్తంగా వివరించారు సంఘం బలోపేతంకి కావాల్సిన ప్రణాళికలను అందరు కలిసి చర్చించటమైనది. రాబోయే జిల్లా నూతన కమిటీ ఎన్నికకు కావాల్సిన ప్రణాళికను రూపొందించడం, సభ్యత్వ నమోదు కార్యక్రమం గురించి చర్చించడమైనది. కార్యక్రమం అనంతరం లంచ్ ఏర్పాటు చేయడమైనది. జిల్లా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు అధ్యక్షులు ఆర్. రాంబాబు నాయక్, ఈ ఎల్ సి కేశవరావు, ప్రధాన కార్యదర్శి. అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి సిహెచ్ వెంకట్ నారాయణ స్టేట్ కౌన్సిలర్స్ సుధాకర్, నోముల శ్రీనివాస్ వీరితోపాటు సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఆళ్ల రాంబాబు, మండల విద్యాశాఖ అధికారులు పద్మ, కెనడి శ్యాం బాబు తదితరులు పాల్గొన్నారు.



# విశాఖ వేదికగా యోగా డే సక్సెస్ చూసి ఓర్వలేకే వైసీపీ నేతల విమర్శలు




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ ఆదివారం మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశం మాట్లాడుతూ మాట్విశాఖ వేదికగా యోగాడే సక్సెస్ చూసి జగన్మోహన్ రెడ్డి వారి పరివారం విషం చిమ్మటం ఎంతో దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో విశాఖలో జరిగిన దేశస్థాయి యో గా కార్యక్రమంలో ప్రపంచ రికార్డు సాధించిన కూటమి ప్రభుత్వంపై జగన్మోహన్ రెడ్డి వారి పరివారం నిప్పులు చెరగడం చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి నైజాన్ని తెలియజేస్తోంది అన్నారు. చంద్రబాబు ఎల్లవేళలా ప్రజాహితం కోరి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న విషయం దేశ విదేశాల పాలకులందరూ గమనిస్తున్నారు అన్నారు. జగన్మోహన్ రెడ్డి అనే మూర్ఖుడుకు మంచి పనులు ఎంత మాత్రం నచ్చడం లేదని మండిపడ్డారు. చంద్రబాబు ముందు చూపుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైటెక్ సిటీ నిర్మాణం చేసిన భారత్ బయోటిక్, విశాఖలో మెడిటెక్ లాంటి ఔషధ కంపెనీలు స్థాపించి కరోనా సమయంలో రాష్ట్రంలోనే కాకుండా దేశంలో అందరిని భారత్ బయోటెక్, మెడిటెక్ కంపెనీ ద్వారా తయారుచేసిన కరోనా వ్యాక్సిన్ మందు లతో ప్రజలందరినీ ఆదుకున్న విషయాన్ని ప్రజలు గ్రహించాలి అన్నారు. కూటమి ప్రభుత్వం మచిలీపట్నంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించి మచిలీపట్నం పేరుని దేశ విదేశాల లో మన మచిలీపట్నం ఇమేజిని పెంచి, మన ప్రాంతానికి పెట్టుబడిదారులను ఆకర్షించి టూరిజం కేంద్రంగా మన బందరును మంత్రి కొల్లు రవీంద్ర తీర్చి దిద్దుతుంటే మాజీ మంత్రి పేర్ని నాని వారి అనుయాయులు మన మచిలీపట్నం అభివృద్ధి చూసి ఓర్వలేక సంబరాల రాంబాబు అని మంత్రి కొల్లు రవీంద్రను విమర్శిస్తూ అనడం వైసిపి నాయకుల కుళ్లుమోతుతనానికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం కోరి క్లీన్ అండ్ గ్రీన్, పచ్చదనం, పరిశుభ్రత, యో గా ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తూ ప్రజలలో అవగాహన కలిగించి ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందే విధంగా చంద్రబాబు చేస్తుంటే, జగన్మోహన్ రెడ్డి అండ్ కో చంద్రబాబును విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో తన స్వార్థం కోసం కల్తీ మద్యం, గంజాయి లు ప్రవేశపెట్టి లక్షల మంది చావుకి కారణమై, ఎంతోమంది కిడ్నీలు, లివర్లు దెబ్బతిని ప్రజలను అనారోగ్యంగా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి అండ్ కో ది కాదా అన్నారు. గిన్నిస్ రికార్డ్ లు సాధించి దేశవ్యాప్తంగా మన రాష్ట్ర ప్రతిష్ట పెంచిన యో గా డే సక్సెస్ వెనక ఎంతో కృషి ఉందని, విమర్శించే వైసిపి జగన్మోహన్ రెడ్డి అండ్ కో చేసే విమర్శలు అర్థరహితమైన విమర్శలని ప్రజలు గ్రహించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ వెంకట కాంతారావు, పి. వి. ఫణి కుమార్, కుంభ రవి కిరణ్, కోసూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల 24వ స్నాతకోత్సవం







## ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు విశ్రాంత ఛీఫ్ జస్టిస్ ఎన్ వి రమణ స్నాతకోపన్యాసం

## 1165 మంది ఇంజనీరింగ్ పట్టభద్ర విద్యార్థులకు పట్టాల ప్రదానం

## నాణ్యమైన విద్య అందిస్తున్న ఎస్ఆర్ జిఇసి ని అభినందించిన జస్టిస్ ఎన్ వి రమణ

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జూన్ 22 :** సమాన అవకాశాలు, సామాజిక చలనశీలతను నిర్ధారించే శాశ్వత సాధనమైన నాణ్యమైన విద్య అందించడంలో శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ముందున్నదని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ నూతలపాటి వెంకట రమణ కొనియాడారు. ఆదివారం ఘనంగా నిర్వహించిన స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల 24వ స్నాతకోత్సవ వేడుక కార్యక్రమానికి జస్టిస్ డాక్టర్ ఎన్ వి రమణ ముఖ్య అతిథిగా విచ్చేసి వివిధ విభాగాల్లోని 1165 మంది ఇంజనీరింగ్ పట్టభద్ర విద్యార్థినీ, విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేసారు. ఈ సందర్భంగా జస్టిస్ డాక్టర్ ఎన్ వి రమణ స్నాతకోపన్యాసం చేస్తూ కళాశాల విద్య ను పూర్తి చేసి, బాహ్య ప్రపంచంలోకి, వృత్తిలోకి అడుగుపెట్టేందుకు ఉద్యుక్తులైన మీరందరూ ముందుగా మీ శక్తి-యుక్తులను, సామర్థ్యాలను, సమాజానికి ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తించుకొని, వాటిని ఆచరించి చూపే క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సాంకేతిక, సామాజిక మార్పుకు రూపశిల్పులైన ఇంజనీర్ల పట్ల మానవ సమాజం గొప్ప గౌరవాన్ని కలిగి ఉందన్నారు. 'శాస్త్రవేత్తలు ఇప్పటికే ఉన్న విషయాన్ని పరిశోధిస్తారు కానీ, ఇంజనీర్లు ఎన్నడూ లేని ఒక కొత్త విషయాన్ని సృష్టించి, ఆవిష్కరిస్తారన్నారు' అని ఆల్బర్ట్ ఐన్స్టీన్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. కళాశాల విద్య ప్రతిభావంతులకు, జ్ఞాన సముపార్జనకు, శ్రేష్ఠత కు నిలయం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఎస్ఆర్ జిఇసి లాంటి సంస్థలు గ్రామీణ-పట్టణ అంతరాన్ని తగ్గించి, విభిన్న నేపథ్యాలు, తక్కువ ప్రాతినిధ్యం ఉన్న వర్గాల విద్యార్థులు, నాణ్యమైన విద్య పొందేందుకు దోహద పడతాయనీ, సంస్థ యొక్క పూర్వ విద్యార్థులు వివిధ ప్రముఖ బహుళ జాతి కంపెనీలలో ఉన్నత స్థాయిలలో కొలువుదీరడం, పరిశ్రమలు స్థాపించి మరెందరికో జీవనోపాధి కల్పించడం అభినందనీయం అన్నారు. "ముఖ్యంగా 1980 నుండి మనదేశంలో ఇంజనీరింగ్ కళాశాలలు గణనీయంగా పెరిగాయని, 1991లో భారత ఆర్థిక వ్యవస్థ సరళీకరణ ఈ వృద్ధిని మరింత వేగవంతం చేసిందని, తద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు సామాజిక, ఆర్థిక చైతన్యానికి ఇంజనీరింగ్, సాంకేతిక విద్య శక్తివంతమైన సాధనంగా మారిందన్నారు. భారతదేశం వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుండి సేవాధారిత ఆర్థిక వ్యవస్థకు మారడం 20వ శతాబ్దం చివరిలో అత్యంత ముఖ్యమైన ఆర్థిక పరివర్తనలో ఒకటని జస్టిస్ డాక్టర్ ఎన్.వి. రమణ గుర్తు చేశారు. భారతీయ న్యాయవ్యవస్థ సామాజిక, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. శ్రామిక శక్తికి పెరుగుతున్న గిరాకీతో, దేశవ్యాప్తంగా నాణ్యత, నైపుణ్యాలతో కూడిన విద్యను అందించే కళాశాలల కొరత ఉందనీ, బోధిస్తున్న విషయాలకు, మార్కెట్ డిమాండ్ చేసే నైపుణ్యానికి మధ్య నిరంతర సంబంధం, పరిశ్రమ ప్రమాణాల ప్రకారం కొరవడుతుందని, తదనుగుణంగా తరచుగా నిరుద్యోగ సమస్య ఏర్పడుతుందని డాక్టర్ ఎన్ వి రమణ ఆవేదన వ్యక్తం చేసారు. విద్యార్థులు ఆచరణాత్మక శిక్షణలో పాల్గొనకుండా ఇంజనీరింగ్ డిగ్రీ పట్టాలను పొందడం వలన విద్యా జ్ఞానానికి, వాస్తవ ప్రపంచ అనువర్తనానికి మధ్య ప్రమాదకరమైన అంతరాన్ని సృష్టిస్తారనీ హితవు పలికారు. తద్వారా జవాబుదారీతనం యొక్క ప్రాముఖ్యతను తట్టుకునే సామర్థ్యాన్ని కోల్పోయి, ఒక మంచి సంస్థలో సమూహంగా పనిచేసే సంస్కృతికి దూరమవుతారని అన్నారు. భారతదేశ అక్షరాస్యత కలిగిన శ్రామిక శక్తి అని, అయినప్పటికీ ప్రపంచ ఆవిష్కరణలు, సాంకేతికత యొక్క వాస్తవికతలో మనం వెనుకబడే ఉన్నామన్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ 2024 ప్రకారం భారతదేశం 133 ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో 39వ స్థానాన్ని దక్కించుకున్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. "వేగంగా మారుతున్న ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకొని, ఇంజనీరింగ్ కళాశాలలు ఇకపై ఉద్యోగాలకు శిక్షణా కేంద్రాలుగా మాత్రమే ఉండకూడదని, ఆవిష్కర్తలు, పరిశోధకులు, వ్యవస్థాపకులను తయారు చేసే సంస్థలుగా రూపుదిద్దుకోవాలని జస్టిస్ డాక్టర్ నూతలపాటి వెంకటరమణ సూచన చేశారు. భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాలు ప్రపంచ సామర్థ్యంలో మూడు శాతం మాత్రమే కలిగి ఉండటం శోచనీయమన్నారు. జీవితంలో అభివృద్ధి చెందుతున్నప్పుడు సమాజాన్ని కూడా మీతో పాటు తీసుకు వెళ్లండి. విజయానికి కొలమానం మీరు ఎంత ఎత్తుకు చేరుకుంటారనేది కాదు. మీరు ఆ మార్గంలో ఎంతమందిని ఉన్నతీకరిస్తారనేదే ముఖ్యమని ఉద్బోధిస్తూ, విద్యార్థులకు శుభాశీస్సులు, అభినందనలు తెలియజేస్తూ జస్టిస్ ఎన్ వి రమణ తన ప్రసంగాన్ని ముగించారు. ముందుగా ముఖ్య అతిథి జస్టిస్ డాక్టర్ ఎన్ వి రమణ కళాశాల ఎన్.ఎస్.ఎస్. బ్యాండ్, ఎన్.సి.సి. క్యాడెట్స్ నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యా సంబంధిత వస్త్రధారణలతో యాజమాన్య సభ్యులు, వివిధ విభాగాల అధిపతులు జస్టిస్ డాక్టర్ ఎన్ వి రమణన స్నాతకోత్సవ వేదికకు ఊరేగింపుగా తోడ్కొని వెళ్ళారు. కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వర రావు కళాశాల 24వ స్నాతకోత్సవం ప్రారంభమైనట్లు ప్రకటిస్తూ రెండు దశాబ్దాలుగా విబిన్న నేపథ్యాలనుండి వచ్చిన వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, ఉద్యోగ భద్రతను కల్పించి సమాజనికి సాంకేతిక శక్తి కలిగిన ఉత్తమ పౌరులను అందిస్తున్నట్లు తెలిపారు. జాతీయగీతం, కళాశాల ప్రార్ధనా గీతాలపనలతో ప్రారంభమైన కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని గంజి స్నేహలత తొలుతగా సభను ఉద్దేశించి అభివాద పలుకులు పలికింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ ప్రారంభోపన్యాసం చేసి, నివేదికను సమర్పిస్తూ 2025 వ సంవత్సరంలో అన్ని విభాగాలలో మొత్తం 1415 విద్యార్థులు పట్టభద్రులు కాగా 1165 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నారనీ, 72.92 శాతం సివిల్, 71.20 శాతం ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, 68.35 శాతం మెకానికల్, 79.70 శాతం ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్, 90.11 శాతం కంప్యూటర్ సైన్స్, 92.38 శాతం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, 85.71 శాతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, 93.94 శాతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, 70 శాతం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విభాగాల వారీగా అత్యధిక సి.జి.పి.ఎ. సాధించిన విద్యార్థులను ప్రకటిస్తూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థినులు వరుసగా కొమ్ము సుప్రియ (9.65), గంజి స్నేహలత (9.52), ఇలపర్తి ప్రియాంక (9.51) అకడమిక్ టాపర్స్ గా నిలవడం విశేషమన్నారు. 33 మంది విద్యార్థులు ఆనర్స్ డిగ్రీ పూర్తి చేయగా, 17 మంది విద్యార్థులు మైనర్స్ డిగ్రీ పూర్తి చేసి అదనంగా 18 క్రెడిట్స్ సాధించటం అభినందనీయమన్నారు. విద్యా సంబంధిత విషయాలలోనే కాకుండా క్రీడా విభాగంలో సహితం కళాశాల విద్యార్థులు ముందంజలో ఉన్నారన్నారు. 25 మంది విద్యార్థులు యూనివర్శిటీ బ్లూస్ గా జె.ఎన్.టి.యు.కె. కాకినాడ కు ప్రాతినిధ్యం వహించి, అంతర్ విశ్వ విద్యాలయం, అంతర్ రాష్ట్ర టోర్నమెంట్ లలో పాల్గొని అనేకానేక పతకాలు, ట్రోఫీ లు గెలుచుకున్నట్లు గుర్తు చేశారు. అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ లలో 17 బంగారు పతకాలు, 10 వెండి పతకాలు, 4 రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విద్యార్థిని కె.అనిత రికార్డు స్థాయిలో అత్యధికంగా 253 పాయింట్లు సాధించి బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్ నిలవడం కళాశాలకు గర్వ కారణమన్నారు. ఈ సందర్భంగా జె.ఎన్.టి.యు.కె. కాకినాడ నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమంలో కళాశాల క్రీడా బృందానికి ప్రశంసలతో కూడిన ధృవీకరణ పత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి నూతన పటభద్రులచే స్నాతకోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

ఆయా విభాగాధిపతుల ఆధ్వర్యంలో పట్టభద్రులైన విద్యార్థినీ విద్యార్థులకు జస్టిస్ డాక్టర్ ఎన్ వి రమణ, కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వర రావు, వైస్ చైర్మన్ ముసునూరి శ్రీనివాసరావు, కళాశాల సెక్రటరీ %డ% కరస్పాండెంట్ వల్లూరుపల్లి సత్యనారాయణ, కో సెక్రటరీ %డ% కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రమోటర్ సొసైటీ చైర్మన్ సుబ్బారావు, వైస్ చైర్మన్ కె.వి.కృష్ణారావు తదితరులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం కళాశాల యాజమాన్యం, ప్రమోటర్ సొసైటీ సభ్యులు ముఖ్య అతిథి జస్టిస్ డాక్టర్ నూతలపాటి వెంకటరమణను జ్ఞాపిక, దుశ్శాలువాతో సత్కరించి సన్మాన పత్రాన్ని సమర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ సన్మాన పత్రాన్ని చదివి శ్రోతలకు వినిపించారు. అనంతరం విద్యార్థులు గత స్మృతులను నెమరవేసుకుంటూ వారి తల్లిదండ్రులతో, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తో కలసి సహ పంక్తి విందు భోజనం చేసి, ఆనందోత్సాహాల మధ్య ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వల్లూరుపల్లి వెంకట కిరణ్, ముసునూరి శ్రీరామ్,వల్లభనేని సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, డైరెక్టర్స్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్, డాక్టర్ ఎం.కామరాజు, డైరెక్టర్ డాక్టర్ పోలేపల్లి సిద్ధయ్య, ఎగ్జామ్ సెక్షన్ ఇన్ ఛార్జ్ కె.కిరణ్ ప్రసాద్, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్ర బాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. గుడ్లవల్లేరు తాసిల్దార్ బి.లోకరాజు, కృష్ణ జిల్లా న్యాయమూర్తి, గుడివాడ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర రావు తదితరులు హాజరయ్యారు.










## శ్రీకొండలమ్మకు భక్తుల పూజలు

### జూన్ 24న హుండీ లెక్కింపు

**గుడ్లవల్లేరు జూన్ 22 మేజర్ న్యూస్:** గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఆదివారం సందర్భంగా అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారిని సుమారు 20,000 మంది పైగా భక్తులు దర్శించుకొనినారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొనినారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు ఉచితముగా మజ్జిగ, ప్రసాదము, త్రాగు నీరు, ఏర్పాటు చేసినారు. దేవస్థానము పరిసర ప్రాంతములలో శానిటేషన్, భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించినారు. శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ, వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేసినారు. జూన్ 24. తేదీన దేవదాయ ధర్మదాయ శాఖ, పోలీస్, రెవెన్యూ, పంచాయితీరాజ్ శాఖల అధికారులు, గ్రామస్తుల సమక్షములో హుండీలు తెరిచి లెక్కించబడునని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## పార్టీకి తాతారావు అందించిన సేవలు మరువలేనివి

### కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తాం

### ఎమ్మెల్యే కుమార్ రాజా



**పమిడిముక్కల జూన్ 22 మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు కృషి చేసిన తాతారావు సేవలు మరువలేనివని పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పమిడిముక్కల మండలం వీరంకిలాకుకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇంచార్జ్ బోలెం వెంకట లక్ష్మీనారాయణ (తాతారావు) ఇటీవల హఠాన్మరణం చెందగా ఆదివారం జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాతారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరికి తలలో నాలుకలా ఉంటూ పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారని, గత సంవత్సరం జరిగిన ఎన్నికలలో కూడా తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. అటువంటి నాయకుడు మృతి చెందటం తనను కలిసివేసిందని, పార్టీ కుటుంబ సభ్యుడిగా ఉంటూ తనకు అన్నిరకాలుగా అందుబాటులో ఉండేవారని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తి మరణించడం చాలా బాధాకరమని పేర్కొంటూ ఆ కుటుంబాన్ని తమ స్వంత కుటుంబంలా భావించి అన్ని విధాల అండగా నిలబడతామని ఈ సందర్భంగా కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పార్టీ నాయకులు కందిమళ్ళ సుబ్రహ్మణ్యేశ్వర రావు, గోపాలకృష్ణ, చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివరామయ్యకు నివాళులర్పించిన వైసీపీ నాయకులు



**పమిడిముక్కల జూన్ 22 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని తాడంకి గ్రామంలో మృతి చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు తుళ్ళూరి శివ రామయ్య పెదకర్మ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు శివరామయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొడమంచిలి మహేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గోర్నిపూడి బుజ్జి, పార్టీ సీనియర్ నాయకులు ఏనుగ మస్తానరావు, ఎంపీటీసీ సభ్యురాలు కూచిపూడి శ్రీ లక్ష్మి, కొంతం శివరామకృష్ణ, మండల కార్యదర్శి కంభపు లక్ష్మయ్య తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని ప్రకటించారు.

# కన్యకా పరమేశ్వరి ఆలయ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం



**నందిగామ, జూన్ 22, మేజర్ న్యూస్ :** పట్టణం లోని శ్రీపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ చక్ర మందిర అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులుగా చవట నాగేశ్వరరావు, వనమా నరసింహారావు,బుల్లెబ్బాయి, మారం వెంకట సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఆదివారం వాసవి కన్యకా పరమే శ్రీదేవి ఆలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక నిర్వహించారు, వాసవి మాత శ్రీ చక్ర మందిరం అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులుగా చవట నాగేశ్వరరావు వనమా నరసింహారావు మారం వెంకట సత్యనారాయణ తో పాటు పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఇప్పటివరకు శ్రీ చక్ర మందిరం అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులుగా కొనసాగిన మారం వెంకటేశ్వరరావు వనమా నరసింహారావు ఊటుకూరు వెంకట సత్యనారాయణ నివేదికతో పాటు జమ ఖర్చు అభి వృద్ధిపై ఆలయ సమావేశంలో సభ్యులకు తెలియపరిచారు, అమ్మవారి సేవలు తమకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి వారు ధన్యవాదాలు తెలిపారు, నూతన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ చక్ర మందిరం కార్యవర్గ సభ్యుల చే ప్రమాణ స్వీకారం చేయించారు అనంతరం కార్యవర్గ సభ్యులను ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ యే చూరు రామకృష్ణ, గోపు శ్రవణ్ కుమార్, మారం వెంకటేశ్వరరావు గోపుకిరణ్, మారం అమరయ్య, కొత్త ప్రభాకర్ రావు, అడ్డగిరి వెంకటేశ్వరరావు, మారం శ్రీనివాసరావు పలువురు ఘనంగా సత్కరించారు, అమ్మవారి సేవలో భక్తి భావంతో ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తామని కార్యవర్గ సభ్యులు సమావేశంలో తెలిపారు.

## "యువత పోరు"లో పెద్ద ఎత్తున యువతరం పాల్గొనాలి : వైసీపీ నేతలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నష్టపోయిన యువత రానికి మద్దతుగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 23న జరగనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుడ్లవల్లేరు మండల వైసిపి యువ జన విభాగ అధ్యక్షుడు గుదే రవి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగ భృతిని విస్మరించిందని, దానిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 'ఇంటికో ఉద్యోగం లేదా నెలకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు' ఇస్తామన్న హామీ కొండెక్కిందని విమర్శించారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది జనవరి 1న నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 'యువగళం' పేరుతో రాష్ట్ర యువత అందరినీ లోకేష్ మోసం చేశారని రవి ధ్వజమెత్తారు.మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద 23వ తేదీన జరగనున్న యువత పోరు ధర్నాలో గుడ్లవల్లేరు మండలం కి చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రవి పిలుపునిచ్చారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



**పామర్రు జూన్ 22 మేజర్ న్యూస్ :** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక మహిళ మృతి చెందిన సంఘటన మచిలీపట్నం - విజయ వాడ జాతీయ రహదారిపై జరిగింది. ఈ సం ఘటనకు సంబం ధించి సేకరించిన వివరాల ప్రకారం పామర్రు మండలం కురుమద్దాలి ఫ్లైఓవర్ పై ఈ ప్రమాదం జరిగింది. కనుమూరు నుండి పామర్రు వైపు నడుచుకుంటూ వస్తున్న మహిళను వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరణించిన మహిళను కూడా గుర్తు తెలియని మహిళగా గుర్తించినట్లు పోలీసులు తెలిపా రు. సంఘటనా స్థలాన్ని పామర్రు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, ఏఎస్ఐ వెంకటే శ్వరరావులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించే పనిలో ఉన్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి గుర్తు తెలియని మహిళ కావడంతో ఆచూకీ తెలిసినవారు పామర్రు పోలీస్ స్టేషన్ 94407 96431 నెంబర్ కు సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ రాజేంద్రప్రసాద్ కోరారు.

## ఎస్సీ బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు ఆహ్వానం

**పామర్రు జూన్ 22 మేజర్ న్యూస్:** ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహము పామర్రు (నిడుమోలు)లో 2025 - 26 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు జరుగుతున్నాయని వసతి గృహ సంక్షేమ అధికారిణి కొడాలి దీనకుమారి తెలిపారు. ఈ వసతి గృహంలో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థినులకు అడ్మిషన్లను ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం పామర్రు లోని భవనం శిథిలావస్థకు చేరిన కారణంగా తాత్కాలికంగా నిడుమోలులో ఈ వసతి గృహాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వసతి గృహంలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థినిలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మూడు పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్ బుక్, పాఠశాల టిసి తదితర ధ్రువపత్రాలతో హాజరు కావలసిందిగా ఆమె కోరారు. పూర్తి వివరాలకు 7702687888 నెంబర్ లో సంప్రదించవలసినదిగా వసతి గృహ సంక్షేమ అధికారిణి దీనకుమారి కోరారు.



## సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

**పమిడిముక్కల జూన్ 22 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అగినపర్రు శివారు బొద్దువాని గూడెంలో కుంపటి సురేష్ ఇటీ వల మరణించగా ఆయన కుటుంబ సభ్య లను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండి ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## బీ.సీల అభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తోటే సాధ్యం

### బీసీ ఉద్యమ నేత వీరంకి వీరస్వామి



**నందిగామ, జూన్ 22, మేజర్ న్యూస్:** కుల గణన చేపడుతున్నందుకు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి జై బీ.సీ ఉద్యమ నేత వీరంకి వీరాస్వామిన్ అభినందనలు తెలిపారు. ఆదివారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ రెండు దశలలో జరగబోయే ఈ జన గణన 2026 అక్టోబర్ 1న ప్రారంభమై - మార్చి ఒకటి 2027న ముగియ పోతుందని కేంద్ర హోం శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందనీ, ఇది మన దేశంలో జరగబోయే 16వ జనగణన అనీ, స్వాతంత్ర అనంతరం జరిగే ఎనిమిదో జనాభా లెక్కింపుగా నిలవబోతోందనీ వీరంకి వీరాస్వామిన్ పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగనన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటం హర్షనీయమని జై బి.సి ఉద్యమ నేత వీరంకి వీరాస్వామిన్ హర్షం వ్యక్తం చేశారు.జనగణ తో పాటు కులగనన చేయాలని ఓబిసి సంఘాలు అనేక రూపాల్లో ఉద్యమాల నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఓబీసీ జనాభా కచ్చితంగా తెలిసేలా వెనుగుబడిన తరగతుల కు చెందిన జాతీయ స్థాయిలో 3746 కులాలు, రాష్ట్రంలోని 139 కులాలకు చెందిన వారి జనాభాతో పాటు, కులాలవారిగా వివరాలు తెలియజేయాలని అప్పుడే బీసీ కులాల జనాభా ఎంతో తెలుస్తుంద అనీ సూచించారు.కులగణన సక్రమంగా నిర్వహిస్తే దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో ప్రాముఖ్యత పెరుగుతుందని వీరాస్వామిన్ పేర్కొన్నారు.దేశంలో బీ.సీల జనాభా నిష్పత్తి ప్రకారం పార్టీల వారికి ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా నరేంద్ర మోడీకి చంద్రబాబుకు కృతజ్ఞతలు ధన్యవాదాలుతెలియజేశారు.

# సంకాబత్తుల వెంకట్ సేవలు గుర్తించి సత్కరించిన అఖిలభారత సంస్థ సక్షమ్



**గన్నవరం, జూన్ 22, మేజర్ న్యూస్ :** దివ్యాంగుల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ సేవలు గుర్తించి అఖిల భారత సంస్థ సక్షమ్ సంస్థ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో విజయవాడ సత్యనారాయణ పురం శిశు విద్యామందిరం ఆడిటోరియంలో ఆదివారం సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ దివ్యాంగుల కొరకు స్పందన మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యాన్ని అందిస్తున్నామని ఆయన అన్నారు. అఖిలభారత సంస్థ అయినా సక్షమ్ అందించిన సత్కారానికి మరింత బాధ్యత పెంచిందని తద్వారా మరిన్ని సేవలను విస్తరిస్తామని వెంకట్ తెలిపారు. సక్షమ్ ఆంధ్రప్రదేశ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై కృష్ణమోహన్ మాట్లాడుతూ దివ్యాంగుల వికాసము, సంక్షేమము, సాధికారిత కోసం 20 జూన్ 2008 న నాగపూర్‌లో ప్రారంభమై దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది దివ్యాంగులను దేశ సమగ్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు, దివ్యాంగుల ఆత్మగౌరవంతో జీవించేందుకు సక్షమ్ కృషిచేస్తున్నదని ఆయన అన్నారు. భారతదేశంలో స్పందన వంటి సంస్థలు దివ్యాంగుల కొరకు అద్భుతమైన సేవలు అందిస్తున్నాయని ఈ సందర్భంగా కృష్ణమోహన్ అభినందనలు తెలిపారు. అనంతరము దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పరికరాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సక్షమ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎ.వి.యస్ మూర్తి ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి గీత, శ్రీలక్ష్మి, దివ్యాంగులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# హత్య కేసును కొన్ని గంటల్లోనే చేదించిన పోలీసులు





**జగ్గయ్యపేట: జూన్ 22 మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద క్రిస్టియన్ పేటకు చెందిన అభిమల్ల వెంకయ్య అనే వ్యక్తి హత్యకు గురికావడం జరిగింది అతని తల్లి అభిమల్ల మణి ఫిర్యాదు మేరకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సీసీ ఫుటేజీల ఆధారంగా హత్య చేయబడిన వ్యక్తిని గుర్తించడం జరిగింది.

హత్య జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే ముద్దాయి విలియం పేటకు చెందిన అల్లూరి కృష్ణగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం జిల్లా కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు పత్రికా సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ మృతుడు కాగితాలు ఏరుకొని జీవనం సాగిస్తూ మద్యానికి బానిసై నిందితుడుతో కొంతకాలం నుండి స్నేహంగా ఉండేవారని శనివారం రాత్రి వైన్ షాప్ దగ్గర ఇద్దరి మధ్య గొడవ జరగడంతో తిరిగి తెల్లవారుజామున 5 గంటల సమయంలో మృతుడు వెంకయ్య ఒంటరిగా ఉండడాన్ని గ్రహించిన కృష్ణ తలపై బండరాయితో బలంగా కొట్టి హత్య చేయబడటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ఘటనపై మృతుడు తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడు పై కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి కొన్ని గంటల సమయంలోనే కేసును చేదించిన సిబ్బందిని రివార్డుతో అభినందించారు. అలాగే మృతుడు నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో దహన సంస్కారాలకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు సబ్ ఇన్స్పెక్టర్ జి రాజులను పలువురు అభినందించారు.

## ఉత్సాహబరితంగా కొత్త మాజేరు హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**చల్లపల్లి మేజర్ న్యూస్:** చల్లపల్లి మండలం కొత్త మాజేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1990-91 సంవత్సరం పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మాజేరు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు పాఠశాల సమయంలో గడిపిన మధుర మృతులను మధుర స్మృతులను జ్ఞాపకం తెచ్చుకుంటూ ఆ సమయంలో పనిచేసిన ఉపాధ్యాయులతో ఆహ్లాదంగా గడిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు పీతా కోటేశ్వరరావు,ఎస్.బేగం టీచర్లను సన్మానించారు. పదవ తరగతి పూర్తి అయ్యాక వివిధ రంగాలలో స్థిరపడి దాదాపు 34 సంవత్సరాలు తరువాత అందరూ ఒకే సారి కలుసుకోవడం పట్ల చాలా ఆనందంగా ఉందని పలువురు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి కాగిత రత్న శేఖర్, మాగంటి సరోజ, కమ్మెల వర లక్ష్మి, ఒంగోలు నుంచి భోగాది శ్రీనివాస్, చల్లపల్లి నుంచి దేవరపల్లి సురేష్, కర్ణాటక నుంచి గొట్టిపాటి శ్రీనివాస్, రేపల్లె నుంచి గోల్కొండ వెంకట లక్ష్మి, విజయవాడ నుంచి పామర్తి శ్రీనివాస్ తలుపుల మాదవి, స్థానికంగా ఉంటున్న మాజేరు భోగిరెడ్డి పల్లి, పుషడం చిట్టూర్పు గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు 50 మంది హాజరయ్యారు.

## మురికి కాలవలో తూములు నిర్మాణం



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం ఆముదాలపల్లి గ్రామంలో నియోజవర్గ శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు గ్రామ ప్రజల సహకారంతో మురికి డ్రైన్ బాగు చేసి తూములు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి డీసీ చైర్మన్ బొర్రా. కాశీ విశ్వేశ్వరరావు, ఆముదాలపల్లి నీటి సంఘం అధ్యక్షులు అబ్బూరి కిరణ్, ములపర్రు సంఘ అధ్యక్షులు చింత వెంకటేశ్వరరావు, రైతు నాయకులు గొట్టిపాటి శ్రీనివాసరావు, గొట్టిపాటి హరికాంత్, జొన్నలగడ్డ కొండ, ఆమదాలపై రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకులు పులింద్రరావుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కోడూరు మేజర్ న్యూస్ :** మండలం పిట్టలంక గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారుబోయిన పులింద్రరావు ఇటీవల అనారోగ్య సమస్య కారణంగా హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకుని అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం వారి ఇంటి వద్ద పులింద్రరావుని అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు, వారి తనయుడు యువ నాయకులు సింహాద్రి వికాస్ పరామర్శించి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలోని ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి దేవినేని నెహ్రూకి ఘన నివాళి



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్ (నెహ్రు) 71వ జయంతి సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 15వ డివిజన్ పార్టీ కార్యాలయంలో విజయవాడ నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్ల రావు ఆధ్వర్యంలో దేవినేని నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి, స్వీట్లు పంచి, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎన్ రాజు, మోహన్ రావు, చిన్న, కలాం, రవి, కామేష్, రామచంద్రరావు, వేట నాని, విస్సు, రంగారావు, ఆంజనేయులు, సత్యనారాయణ, కుమార్, కాము, రంగ,వైఎస్సార్సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవస్థానానికి కుర్చీల బహుకరణ



**నందిగామ, జూన్ 22, మేజర్ న్యూస్:** పట్టణ శివారు పల్లగిరి కొండ శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నాడు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవి సభ్యులు పులిపాటి వెంకటేశ్వరరావు సంధ్యారాణి దంపతులు దేవాలయానికి కుర్చీలు బహుకరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు దేవస్థానం సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు తొర్లికొండ సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రావూరి లక్ష్మి కి నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్



**నందిగామ, జూన్ 22, మేజర్ న్యూస్:** ముప్పాళ్ళ గ్రామ వాస్తవ్యులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావూరి సాయి సతీమణ రావూరి లక్ష్మీ దశ దిన కర్మ కార్యక్రమం ఆదివారం ఈ కార్యక్రమంలో కూటమి నేతలతో కలసి మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు. అనంతరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆవిడ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అనుమోలు కిషోర్, యనద్రపల్లి శ్రీనివాసరావు,కొండూరు వెంకటరమణ,రాటకొండ రమణ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పార్టీ తీర్థం పుచ్చుకున్న గన్నవరం సర్పంచ్



**గన్నవరం, జూన్ 22, మేజర్ న్యూస్ :** గన్నవరం పంచాయతీ సర్పంచ్ నిడమర్తి సౌజన్య- నాగేశ్వరరావు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి చేతుల మీదుగా బీజేపీ పార్టీ లో తీర్థం పుచ్చుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఎస్సి మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్ సింగ్ ఆర్యా జీ గన్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి విచ్చేసి ఇరువురుని పార్టీలోకి ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో భాగంగా లాల్ సింగ్ ఆర్యా జీ గన్నవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ సౌజన్య, నాగేశ్వరరావు ను శాలువతో ఘనంగా సత్కరించడం జరిగింది. అననంతరం లాల్ సింగ్ ఆర్యా జీ చేతుల మీదుగా మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమం లో టీడీపీ సౌత్ ఆఫ్రికా తెలుగుదేశం పార్టీ దేశ అధ్యక్షుడు(పి.ఆర్ కే ఫౌండేషన్ చైర్మన్) పారా రామకృష్ణ, జనసేన నియోజకవర్గ నాయకులు గరికపాటి శివ శంకర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి క్రీడలకు యువత పోటీ పడాలి



**యువనేత మండలి వెంకట్రామ్**

**మోదుమూడి ప్రీమియర్ లీగ్ విజేత చెరుకుపల్లి జట్టు, రన్నర్ మోదుమూడి జట్టు**

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** జాతీయస్థాయి క్రీడలలో పాల్గొనేందుకు యువత పోటీ పడాలని యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో మోదుమూడి ప్రీమియర్ లీగ్ క్రికెట్ సీజన్-2 ఫైనల్ మ్యాచ్, బహుమతి ప్రదానోత్సవం జరిగింది. మోదుమూడి ప్రశాంత్ టీమ్, చెరుకుపల్లి గణేష్ టీమ్ మధ్య హోరాహోరి సాగిన పోరులో ఫైనల్ మ్యాచ్ టై కావటంతో సూపర్ ఓవర్ నిర్వహించగా చెరుకుపల్లి గణేష్ టీమ్ విజేతగా నిలిచారు. ఈ టోర్నమెంట్ విన్నర్ చెరుకుపల్లి గణేష్ జట్టుకు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ట్రోఫీ బహుకరించారు. విద్యానికేతన్ విద్యాసంస్థల అధినేత, అశ్వారావు పాలెం సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ రూ.30 వేలు నగదు బహుమతి అందచేశారు. రన్నర్ మోదుమూడి ప్రశాంత్ జట్టుకు వెంకట్రామ్ ట్రోఫీని, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషబాబు ఆర్థిక సహకారంతో రూ.ఇరవై వేలు నగదు బహుమతిని అందచేశారు. మూడవ స్థానంలో నిలిచిన పులిగడ్డ జట్టుకు వెంకట్రామ్ ట్రోఫీను, మోదుమూడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బచ్చు వెంకట నారాయణ రూ.పది వేలు నగదు బహుమతిని అందచేశారు. నాలుగో స్థానంలో నిలిచిన టీ.కొత్తపాలెం జట్టుకు వెంకట్రామ్ ట్రోఫీ, అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి రూ.5వేలు నగదు బహుమతి అందచేశారు.

విజేత జట్లులకు, క్రీడాకారులకు ఎంపీటీసీ సభ్యులు కటికల వసంత్ ఆర్థిక సహకారం రూ.పది వేలతో ట్రోఫీలు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గాజుల శంకరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు బచ్చు వెంకట నారాయణ, గ్రామ సర్పంచ్ బచ్చు బేబీ, అశ్వారావుపాలెం సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్, మత్తి శివపార్వతి, బొప్పన పృథ్వి పాల్గొన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ బచ్చు ప్రశాంత్ ఆధ్వర్యంలో జూన్ ఒకటో తేదీ ప్రారంభించిన ఈ పోటీలను బచ్చు కిరణ్ తేజ, ఆదూరి గణేష్, మత్తి రాజేష్, ఆదూరి అరుణ్, సింగం గోపీ, బచ్చు రామాంజనేయులు, బచ్చు రాము, బచ్చు సుధీర్ పర్యవేక్షించారు.



# అమరావతిని మెడికల్ హబ్ చేయాలన్నదే సీఎం లక్ష్యం



**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**ఆరోగ్య యూరాలజీ అండ్ గైనకాలజీ సెంటర్ హాస్పటల్ ప్రారంభం**

**ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్ హాజరు**

**విజయవాడ మేజర్ న్యూస్ :** రాజధాని అమరావతి ప్రాంతాన్ని మెడికల్ హబ్ గా తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం. విజయవాడకు మరిన్ని హాస్పటల్స్ రావాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు.విజయవాడ సూర్యారావు పేట ప్రకాశం రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ఎన్. సుబ్బారావు సెంటర్ ఫర్ కార్డియాక్ కేర్ హాస్పిటల్ ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్, కేర్ హాస్పటల్ ఎం.డి పద్మశ్రీ డాక్టర్.బి.సోమరాజుతో కలిసి ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరంలో డాక్టర్ ఎన్. సుబ్బారావు గొప్ప పేరున్న వైద్యులు అని, ఆయన పేరుమీద హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి లక్ష్యాల మేరకు విజయవాడ ను మెడికల్ హబ్ గా మార్చుకునేందుకు, యువ వైద్యులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్య సేవలు ప్రారంభించేందుకు కావాల్సినసహాయ సహకారాలు అందిస్తామన్నారు. డాక్టర్ మురళీకృష్ణ తన కుటుంబంలోని వైద్యులతో కలిసి వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన మోడల్ టెక్నాలజీతో నగరంలోనే హాస్పిటల్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆకాంక్షించారు.మాజీ మంత్రి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ మురళీకృష్ణ ఆయన తండ్రి పేరిట హాస్పిటల్ ను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ట్రీట్మెంట్ తో పాటు రోగులను ఆప్యాయంగా పలకరించాలని డాక్టర్ మురళీకృష్ణ కుటుంబం ఆ తరహా సేవలు అందిస్తారని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఇద్దరికే దండం పెడతారని ఒకరు వైద్యులు, మరొకరు వైద్యుడు అని పేర్కొన్నారు. ఈ హాస్పిటల్ ద్వారా మంచి సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ లో డాక్టర్ ఎన్. సుబ్బారావు హాస్పిటల్ అంటే ఒక ల్యాండ్ మార్క్ అని చెప్పుకొచ్చారు. అలాంటి హాస్పిటల్ కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా వారి మూడవ జనరేషన్ హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సర్వీస్ తరహాలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని అభిప్రాయపడ్డారు. వైద్యులు లివింగ్ గాడ్స్ అని దేవుడు ప్రాణం ఇస్తే, వైద్యులు ప్రాణం పోస్తారని వెల్లడించారు. ఈ హాస్పిటల్ మంచి వైద్యసేవలు అందించి విజయవాడలో మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ తమ హాస్పటల్లో యురాలజీ సమస్యలతో పాటు, గుండె జబ్బులకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు లభిస్తాయని తెలియజేశారు. నిష్ణాతులు అయిన వైద్యులు వైద్య సేవలు అందిస్తారని ఆధునిక పద్ధతులలో వైద్యం అందిస్తారని వివరించారు. రోబోటిక్ యూరో, అంకాలజీ హై రిస్క్ ప్రసవాలు ఆధునిక లేపరోస్కోపిక్ గైనకాలజీ సేవలు అందుబాటులో వున్నట్లు తెలిపారు.సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్.ఎన్.మురళీ కృష్ణ మాట్లాడుతూ తమ పిల్లలు కార్డియాలజిస్ట్ డాక్టర్ వరుణ్ నల్లమోతు, కార్డియాలజిస్ట్ డాక్టర్ పవన్ నల్లమోతు, యురాలజిస్ట్ డాక్టర్ మనోజ్ తుమ్మల, గైనకాలజిస్ట్ డాక్టర్ వర్షిణి తుమ్మల వైద్య సేవలు ప్రజలకు ఉపయోగపడాలని ఒపిడి సేవలు ప్రవేశపెట్టామని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న ఉద్దేశంతో వైద్యసేవలు ప్రారంభించామన్నారు. మెడికల్ నాలెడ్జ్ కి అంతు లేదని నిత్యవిద్యార్థి లా నేర్చుకుంటేనే ఉండాలని పేర్కొన్నారు.కేర్ హాస్పటల్ ఎం.డి పద్మశ్రీ డాక్టర్ సోమరాజు మాట్లాడుతూ డాక్టర్ మురళీకృష్ణ కుటుంబసభ్యులు వైద్య వృత్తిలో ఉండటం గర్వకారణమని అన్నారు. వైద్యం లో అనేక మార్పులు వచ్చాయని చాలా ట్రీట్మెంట్ లు డే కేర్ క్లినిక్ తరహాలో మారాయని ఇది శుభపరిణామం అన్నారు. అనారోగ్యం వచ్చాక ఆసుపత్రిలో చేరడం కాదని.. ఆ అనారోగ్యం దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆసుపత్రిని దినదినాభివృద్ధి చెంది మంచి వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎపి, తెలంగాణ యురాలజీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.వి.రవికుమార్, చెన్నై యురాలజీ అండ్ రోబోటిక్స్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ అనంతకృష్ణన్ శివరామన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## 23వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 23వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

## శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రులు



**కంచికచర్ల జూన్ 22 మేజర్ న్యూస్ :** స్థానిక మహాల క్ష్మీ అమ్మవారి ఆలయంలో ఈనెల 26వ తేదీ గురు వారం నుంచి జూలై 5వ తేదీ శనివారం వరకు వారహి అమ్మ వారి నవరాత్రులు నిర్వహించడం జరుగుతుం దని ఆలయ అర్చకులు కాకాని బాబి తెలిపారు. ఆషా ఢమాసం పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీ నుంచి వారాహి నవరాత్రులు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి వారాహి నవరాత్రులలో రాత్రి వేళల్లో విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని కావున భక్తులు పెద్ద ఎత్తున ఈ తొమ్మిది రోజుల పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మ వారి కరుణ కృప కటాక్షములకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం..

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 23వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక– మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక –మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చున్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్సైట్లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ కోరారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
**ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999